క్లుప్తంగా

విద్యార్థులకు హెల్త్ కార్డుల పంపిణీ



భూత్పూర్: పట్టణంలోని సాహితి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం రవి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శేఖర్ ఉచిత హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యనభ్యసించడానికి పట్టణ ప్రాంతాలకు వస్తున్నారని, విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులకు కొంత భారాన్ని తగ్గించడానికి హెల్త్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా రవి ఫౌండేషన్ చైర్మన్‌ను కరస్పాండెంట్ సత్యం, ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

నేడు రామయ్యబౌలిలో ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌలీలో మంగళవారం హజ్రత్ షేక్ రఫీయొద్దీన్‌షా ఖాద్రీ దర్గా, హజ్రత్ షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్‌షా ఖాద్రీ షర్ఫీ ఉర్సును నిర్వహించనున్నట్లు ముతవల్లీ షైక్ సైఫొద్దీన్ ఖాద్రీ తెలపారు. అసర్ నమాజ్ అనంతరం నాతే షరీఫ్, రాత్రి 7 గంటలకు గంధోత్సవ, 8 గంటలకు అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో 10వ ధార్మికసభ ఉంటుందని తెలిపారు. వేడుకల్లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మహ్మద్ రఫీయొద్దీన్ హుస్సేని, సయ్యద్ మహ్మద్ మహమూద్ హుస్సేని, కాజం మొహియొద్దీన్, మహ్మద్ అబ్దుల్ మొయిజ్, అబ్దుల్ మొహిమిన్, ఇఫ్తెకార్, కర్నూల్‌కు చెందిన హుస్సేనీ పీర్ హుస్సేని తదితర ధార్మిక వేత్తలు పాల్గొని సందేశాలు ఇస్తారని తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తం

నవాబుపేట: వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీజన్‌లో అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో అందరు పారిశుద్ధ్య చర్యలకు సిద్ధం చేయాలన్నారు. నిత్యం గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతూనే ఉండాలన్నారు. గ్రామాలకు అవసరమైన వాటిని మండల అధికారులతో మాట్లాడి సమకూర్చుకుని పారిశుద్ధ్య పనులు నిరాటంకంగా జరిగేలా చూడాలని పంచాయతీ అధికారులకు సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ నసీర్ అహ్మద్, ఏపీఓ జ్యోతి, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన



జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్, కుర్వపల్లి పాఠశాలలను ఎంఈఓ మంజులాదేవి, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. బోధనా పద్ధతులు, గణితంలో చతుర్విధ ప్రక్రియ, తెలుగు, ఇంగ్లిష్‌లో చదవటం, రాయటం తెలుసుకున్నారు. చదవటం, రాయటం రాని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో బోర్డుపై రాయించి వారికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంతాబాయి, కోడ్గల్ హెచ్‌ఎం మదన్‌మోహన్, కుర్వపల్లి హెచ్‌ఎం మల్లయ్య పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ల పరిధిలోని ఏఈవోలు గ్రామాల్లో పర్యటిస్తున్నారని, రైతులు అందుబాటులో ఉండి వారికి సహకరించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్, పంటల బీమా, రైతుభరోసా డబ్బులు అకౌంట్‌లోకి వేయాలంటే రైతులు తమ భూముల సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డులు ఏఈవోల వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని కోరారు.

తీన్మార్ మల్లన్నపై దాడి ఖండించిన బీసీ సమాజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండిస్తూ బీసీ సమాజ్, ఇతర బీసీ సంఘం నాయకులు మంగళవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వారు మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి చాలా మంది మేధావులు, వివిధ పార్టీల్లో ఉన్న బీసీ నాయకులు రాజకీయ చైతన్యంతో ముందుకు పోతున్న ఈ సందర్భంలో కవిత బీసీ నినాదంతో మరో కుట్రకు తెరలేపారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్, మైత్రి యాదయ్య, రవి ముదిరాజ్, ఆంజనేయులు, రాకేష్ పటేల్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు పడావు

- మరమ్మతుకు నోచుకోని వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఏపుగా పెరిగిన జమ్ము, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు
- చెరువులు, పంటపొలాలకు సాగునీరు అందక రైతుల ఇక్కట్లు



ఏదులాపురం సమీపంలో చింతకుంట గొలుసుకట్టు చెరువులో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు



లాల్‌కోట సమీపంలో కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ కుడికాల్వకు ధ్వంసమైన ఫీడర్ చానల్

చిన్నచింతకుంట: గొలుసుకట్టు చెరువులు, పంట పొలాలకు సాగునీరదించే కాల్వలు పడావు పడ్డాయి. అధికారుల పర్యవేక్షణా లోపంతో మరమ్మతుక నోచుకోవడంలేదు. కాల్వల్లో ఏపుగా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి నిండుగా అలుముకున్నాయి. పంటపొలాలకు సాగునీటిని అందించే కాల్వలకు ఫీడర్ ఛానల్, తూములు ధ్వంసమమై వర్షపు నీరు చెరువులకు చేరలేని దుస్థితి నెలకొంది. చెరువులు నిండినా పంట పొలాలకు సాగునీరు అందని పరిస్థితి. ఇప్పటికే కాల్వల మరమ్మతుకు పలుమార్లు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వాటి పరిస్థితి మారడంలేదు. ఏటా ఉపాధి హామీలో కూడా కాల్వల మరమ్మతు చేపట్టి ముళ్లపొదలు తొలగించేవారు. ఈసారి అధికారులు వాటిపై దృష్టి సారించక కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది.

మరమ్మతులకు నోచుకోని కాల్వలు

చిన్నచింతకుంట ఉమ్మడి మండలంలోని, అల్లీపురం, మద్దూర్, చిన్నచింతకుంట, ఏదులాపురం, ముచ్చింతల, అప్పంపల్లి, తిర్మలాపురం, గూడూర్ గ్రామాల గొలుసు కట్టు చెరువులకు కాల్వలున్నాయి. ఊకచెట్టువాగు, భారీ వర్షాల ద్వారా ఏడు చెరువులకు నీరు చేరుకుంటుంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని వదిలినప్పుడు బండర్‌పల్లి నుంచి లాల్‌కోట, నెల్లికొండిలోని 5వేల ఎకరాలకు సాగు నీరందుతోంది. రామన్‌పాడ్ ప్రాజెక్ట్ నుంచి కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు అమ్మాపురం, కురుమూర్తిలోని 200ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే ఈ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాల్వల్లో జమ్ము, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు అలుముకున్నాయి. సాగునీటి కాల్వలకు ఫీడర్ ఛానల్, తూములు ధ్వంసమయ్యాయి. ఈ సంవత్సరం వర్షాలు కురిసి వరదలు వస్తే చెరువులు, పంటపొలాలకు నీరందని పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా అధికారులు కాల్వలపై దృష్టిసారించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడుతున్నాం



ఉపాధి హామీ ద్వారా మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న చెరువులు, కుంటలు, సాగునీటి కాల్వల్లో కూలీలతో పూడికతీత, ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నాం. ఒకసారి కాల్వకు మరమ్మతు చేపడితే 3ఏళ్ల వరకు మళ్లీ ఆ కాల్వకు ఎలాంటి మరమ్మతులు చేపట్టేందుకు వెసులుబాటు లేదు. అందుకు కాల్వల్లో యథావిధిగా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి.

– నవీన్‌కుమార్, ఏపీఓ చిన్నచింతకుంట

మరమ్మతులు చేపట్టాలి



గొలుసుకట్టు చెరువుల కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు చెత్తాచెదారంతో అలుముకున్నాయి. భారీ వర్షాలు కురిసి వరదలు వస్తే చెరువులకు నీరు చేరకుండా కాల్వలు తెగి వృథాగా పోయే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు గొలుకట్టు చెరువు కాల్వలపై దృష్టిసారించాలి.

– లంకాల శేఖర్, రైతు, అమ్మాపురం

చివరి ఆయకట్టుకు నీటి ఇబ్బందులు



కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం కాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరందక ప్రతి సంవత్సరం రైతులు సాగు చేసుకున్న పంటలు ఎండిపోతున్నాయి. జమ్ము, ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో అధికారులు నీటిని వదిలినా ఫలితం లేకుండాపోతుంది. వృథాగా పోయి సాగుకు సక్రమంగా అందడంలేదు.

– పుట్ట దశరత్, రైతు, అమ్మాపురం

సన్నాలపై బోనస్ వెంటనే విడదల చేయాలి



నవాబుపేట: రైతులకు సన్నవడ్లపై రైతులకు ఇచ్చే బోనస్ వెంటనే విడదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన రైతులకు వెంటనే బోనస్ విడదల చేయాలంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. వడ్లు కొనుగోలు చేసి దాదాపు నెలరోజులు గడుస్తున్నా రైతులకు ఇంకా బోనస్ విడదల చేయకపోవడం విడ్డూరమన్నారు. కేవలం రైతులను ఎన్నికల కోసం వాడుకుంటూ వారిని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తాజాగా బీసీ రిజర్వేషన్ల వ్యవహారం తీసుకుని వచ్చారని.. దాన్ని అధికార పార్టే రద్దాంతం చేస్తు అనుమానాలు వ్యక్తం చేయడం భావ్యం కాదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తునే ఉంటామని వివరించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు యాదయ్య, శ్రీనివాస్, నరేందర్, మండల ప్రధానకార్యదర్శి గణేశ్, రాఘవేంద్రచారి, నరేశ్, చంద్రప్రకాశ్‌రెడ్డి, బస్వరాజ్, నర్సింహులు, వెంకటేశ్, రాజేందర్, మాసయ్య, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి

అడ్డాకుల/భూత్పూర్: జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన భూత్పూర్, మూసాపేటలో మాట్లాడుతూ.. అగ్రకుల పార్టీలు బీసీలను ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించలేదన్నారు. విద్య, ఉద్యోగాల్లో కూడా బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీకి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న బీసీ కులాల భవిషత్ కార్యాచరణపై బీసీ నేతలు, ప్రజాప్రతినిధులతో కొత్తకోటలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బీసీ నేతలు, యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, కొండయ్య, తిరుపతయ్య, నర్సింహసాగర్, కురుమూర్తి, ఆంనేయులు ఉన్నారు.

'కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంపై అందరూ కలిసి ఒత్తిడి తేవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది పార్టీల మధ్య సమస్య కాదని బీసీ రిజర్వేషన్ల పెంపు అనేది రాష్ట్రానికి సంబంధించిందని పేర్కొన్నారు. పార్లమెంట్ తీర్మానంతో 9వ షెడ్యూల్‌లో చేరిస్తేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. అందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ముందుకు రావాలన్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి



దేవరకద్ర: టీచర్లకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం దేవరకద్ర బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీలో సంఘం సభ్యత్వాలను చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించి మెడికల్, సరెండర్, జీపీఎఫ్ తదితర పెండింగ్ బకాయిలు సత్వరమే చెల్లించాలని కోరారు. బదిలీలు, పదోన్నతుల కూడిన షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. బకాయిల విషయంలో ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ గౌరవాధ్యక్షుడు బుచ్చారెడ్డి, అశ్వినీ చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్, రఘువర్ధన్‌రెడ్డి, పురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

చిన్నచింతకుంట: దేవరకద్ర మండలం బస్వాపురం గ్రామానికి చెందిన మంగలి శ్రీను గతనెలలో అమావాస్యను పురస్కరించుకొని కురుమూర్తిస్వామి దర్శనానికి వచ్చారు. ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ తస్కరించారు. ఈ విషయంపై చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఐఆర్‌టీ పోర్టల్ ద్వారా గుర్తించి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ బాధితుడికి ఫోన్ అందజేశారు.

16వ తేదీన రాయల వర్ధంతి సభ



మహబూబ్‌నగర్ న్యూటౌన్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను ఈనెల 16న నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమంలో అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు దేవదానం, జిల్లా కార్యదర్శి సాంబశివుడు, బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ టైర్లు చోరీ

హన్వాడ: మండలంలోని కొత్తపేట జీపీకి చెందిన వాటర్ ట్యాంకర్‌కు సంబంధించిన రెండు టైర్లు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకర్‌ను ఎప్పటిలాగే గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపారు. ఈనెల 11న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వాటర్ ట్యాంకర్ ట్రాలీకి ఉన్న రెండు టైర్లను విడదీసి తస్కరించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి గంగాభాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన ఎండీ పాషా బూరెడ్డిపల్లి శివారులోని ఫాం హౌస్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈనెల 6న రాత్రి భోజనం చేసి పడుకున్న తరువాత మధ్యరాత్రి తన కూతురు సఫియా బేగం (19) ఇంటినుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిందని తండ్రి ఎండీ పాషా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కూతురు వద్ద మొబైల్ నెంబర్‌కు కాల్ చేయగా కలవడం లేదని, చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ నివాసంలో మంగళవారం ఘనంగా గోరింటాకు వేడుకలు నిర్వహించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రసన్న, వార్డు మహిళలు ధనలక్ష్మి, కృష్ణవేణి, ప్రభావతి, సృజన, మణిమాల, సుమిత తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధికి రూ.30వేల విరాళం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిరం సహాయనిధికి పూర్వ ఆచార్యులు నర్మద కుమారుడు అభిషేక్ రూ.30వేల చెక్‌ను ప్రధానాచార్యులు వెంకటయ్యకు సోమవారం అందజేశారు. ఆర్థికంగా వెనకబడి చదువులో చురుకైన విద్యార్థుల నిర్వహణకు డబ్బులు వినియోగించనున్నట్లు ప్రధానాచార్యులు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం: ఏడీఈ



శివశక్తినగర్‌లో పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ శౌర్యనాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని పాతపాలమూరు, శివశక్తినగర్, తెలుగుగేరి తదితర ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏడీఈ శౌర్యనాయక్ స్థానికులకు హామీ ఇచ్చారు. సోమవారం ఈ ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్‌వి ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లంగారి భరత్‌కుమార్, మాల్యాద్రి, కుమార్, నరేశ్, ముక్రం, షకీల్, అనిత, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కోవడం సమంజసం కాదు

మహబూబ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ హయాంలో దళితులకు పంపిణీ చేసిన భూములను ఆకస్మాత్తుగా అటవీ భూములుగా చూపుతూ అధికారులు వారి నుంచి లాక్కోవడం సమంజసం కాదని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. అధికారులు దళితుల భూముల రికార్డులను పరిశీలించి వారికి న్యాయం చేయాలని కోరారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని ఏనుగొండ రెవెన్యూ గ్రామ శివారులో సర్వేనంబర్ 431, 433, 433/1లో గల దళితుల భూములను అటవీశాఖ అధికారులు లాక్కోవడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక ధర్నాచౌక్‌లో బాధిత రైతులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షకు పలు కులసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. దళితులు తరతరాలుగా భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని, ఆ భూమిని ఫారెస్టు అధికారులు బలవంతంగా లాక్కొని మొక్కలు నాటడం రాష్ట్రంలో దళితులను అవమానపరచడమేనన్నారు. ప్రభుత్వం దళితుల భూముల జోలికి రాకుండా, చట్టం తీసుకొచ్చి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్–2006 అటవీ చట్టం ద్వారా దళిత రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా సర్వేనంబర్ 435 పట్టా భూమిలో అక్రమంగా తీసిన ట్రెంచ్ (పెద్ద కాలువలు) మూసివేయాలని, ఏనుగొండ శివారులోని మాదిగలకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఇళ్లు లేని మాదిగలకు 250 గజాల చొప్పున స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షకు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీక్షలో బాధిత రైతులు సీహెచ్ వెంకటయ్య, జెమినీ కృష్ణ, నర్సింహులు, రాములు, మధు, సత్యం, మన్యం, చెన్నయ్య, శంకర్, సుక్కమ్మ, పెంటమ్మ, నాగమణి, మహేశ్, వెంకటమ్మ, నర్సమ్మ కూర్చున్నారు.



రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

బాలానగర్ సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని బాలనగర్ సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ రిజర్వేషన్ చేయాలని గ్రామ దళిత ఉపకులాల ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మా గ్రామం ఎస్సీ రిజర్వేషన్ కాలేదని పేర్కొన్నారు. గ్రామంలో 500 దళిత ఇండ్లు ఉంటాయని ఇందులో 2వేల జనాభా ఉందని తెలిపారు. ఇప్పటిదాక పదిసార్లు జనరల్ రిజర్వేషన్ కాగా.. 5సార్లు బీసీ రిజర్వేషన్, ఒక్కసారి ఎస్టీ రిజర్వేషన్ వచ్చిందన్నారు. ఎస్టీ రిజర్వేషన్ అయినప్పుడు కేవలం మా గ్రామంలో నాలుగు కుటుంబాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కేవలం నాలుగు ఇండ్లున్న వారికి రిజర్వేషన్ కల్పించినప్పుడు 2వేల జనాభా కలిగిన ఎస్సీలకు ఎందుకు రిజర్వేషన్ కావడం లేదని వివరించారు. దళితులపై దయ ఉంచి ఈసారి వచ్చే ఎన్నికల్లో తమ గ్రామాన్ని ఎస్సీ రిజర్వేషన్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, మధు, సాయిలు, మహేందర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన అనంతరం బాలనగర్ దళితులు

'ఊకచెట్టు వాగులోకి నీటిని వదలాలి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకులు

చిన్నచింతకుంట: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, పర్దిపూరం రిజర్వాయర్ నుంచి ఊకచెట్టు వాగులోకి అధికారులు నీటిని వదిలి వాగు పరిసర ప్రాంతాల రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు నంబిరాజు, కుర్వ రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం చిన్నచింతకుంటలో బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమై నెల గడిచినా ఆశించిన వర్షాలు పడలేదన్నారు. అందుకు మండలంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నీరులేక ఎడారిని తలపిస్తూ పలు గ్రామాలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు తెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఊకచెట్టు వాగు పరిసర ప్రాంతాల గ్రామాల రైతులు సాగునీరు లేక వరినాట్లు వేసుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వెంటనే అధికారులు పర్దిపూరం రిజర్వాయర్, కోయిల్ సాగర్ ప్రాజెక్టునుంచి ఊకచెట్టు వాగులోకి నీటిని వదిలాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహయాదవ్, జలీల్, లంకాల రవి, వికాస్ నరసింహ, మైను, మధు ఉన్నారు.

కేఎల్ఐ కాల్వకు నీరు విడుదల చేయాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిడ్జిల్: వర్షాల్లేక రైతులు సాగు చేసిన పంటలు మండలంలో ఎండిపోతున్నాయని, కేఎల్ఐ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు సోమవారం మిడ్జిల్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నిండి గేట్లు ఓపెన్ చేసి, వారం రోజులవుతున్నా ప్రభుత్వం ఇక్కడ రైతులకు సాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని, రైతుల గోస పట్టించుకోని కేఎల్ఐ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్, బాలు, శ్రీనువాస్‌గౌడ్, జగన్, మోహన్, సురేశ్, సుకుమార్, వెంకటయ్య, నర్సింహ ఉన్నారు.

హన్వాడలో బీసీ నాయకుల సంబరాలు



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హన్వాడ: మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డుపైకి చేరి టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీలు రుణపడి ఉంటారని మండలాధ్యక్షుడు మహేందర్ కొనియాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయఢంకా మోగించనున్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేడు బీసీల పేరుతో మొసలి కన్నీరు కార్చుతూ.. బీసీ రాగం ఎత్తుకుందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లు ప్రకటించి ఆర్డినెన్స్ జారీచేసిన సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య యాదవ్, కృష్ణయ్య, సత్యయ్య, షబ్బీర్, నర్సింహులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సందోళ్ల శ్రీవిద్యను సోమవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. బాసర ట్రిబుల్ ఐటీ నిర్వహించిన ఎంపికలో ఇంటర్ కం బీటెక్ మహబూబ్‌నగర్‌లోనే సీటు దక్కిందని హెచ్‌ఎం లక్ష్మి తెలిపారు. జిల్లాలో ప్రారంభమతున్న ఏడాదిలోనే తమ పాఠశాల నుంచి విద్యార్థిని ఎంపికవడం గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు నర్సోజి విద్యార్థినికి రూ.వెయ్యి నగదు ప్రోత్సాహం అందించారు. అలాగే పాఠశాల టాపర్లు నందిని, హరిప్రియ, సమీరను సన్మానించారు.